06ATP27_06ATP27.qxd 06-01-2023 PM 10:48 Page 1



## మండలకేంద్రంలో మైనర్ బాలిక అదృశ్యం

**బత్తలపల్లి, జనవరి 6 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన మైనర్‌బాలిక 10రోజుల క్రిత్రం అదృశ్యమైనట్లు బాలిక తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాధు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వడ్డెరకాలనీకి చెందిన ఓ కుటంబానికి చెందిన మైనర్ బాలిక కర్నాటక రాష్ట్రం దోడ్డబళ్లాపూర్‌లో ఇంటర్ చదువుతున్నట్లు తెలిపారు. ఆనారోగ్యంతో డిసెంబర్‌లో ఇంటికి వచ్చిన బాలిక డిసెంబర్ 27వ తేదీన తల్లి పనికి వెళ్లిన సమయంలో ఇంటినుండి వెళ్లిపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం బుక్కపట్నం మండలం గసికవారిపల్లికి చెందిన దేరంగుల విజయ్‌పైన అనుమానం వుందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థులు ఎక్కువ ఇచ్చే రేషన్ తక్కువ


విఆర్ఓకు విషయాన్ని తెలియజేస్తున్న విద్యార్ధులు

**బత్తలపల్లి, జనవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్ధులకు మంచి విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేస్తే, బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో మాత్రం విద్యార్ధులు ఎక్కువగా హాజరైనా తక్కువగా రేషన్ ఇచ్చి వండమని ప్రధానోపాధ్యాయురాలు ఆదేశించడంతో పలువురు విద్యార్ధులు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.


విద్యార్ధులకు భోజనం వడ్డిస్తున్న సిపిఐ నాయకులు కమతం కాటమయ్య

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు చెప్పిన వివరాల మేరకు శుక్రవారం రోజున పాఠశాలకు 350మంది విద్యార్ధులు హాజరు కాగా ప్రధాన పాధ్యాయురాలు 260మందికి మాత్రమే రేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన రేషన్‌తోనే వంట చేయగా 28మంది విద్యార్ధులకు తక్కువ వచ్చిందని, విషయాన్ని హెచ్‌ఎంకు తెలపగా మరో 22మందికి రేషన్ ఇచ్చిందన్నారు. అయినప్పటికి 6మందికి తక్కువ వచ్చిందన్నారు. ఇదే విషయాన్ని తహశీల్దార్ యుగేశ్వరీదేవి, ఎంఈఓ చాముడేశ్వరికి తెలపగా విఆర్‌ఓ రవికాంతెడ్డి, ఎంఈఓలు పాఠశాలకు వచ్చి విద్యార్ధులను విచారించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలితో వివరణ కోరగా 260మందికి రేషన్ ఇచ్చామని, పప్పు చేసిన రోజున విద్యార్ధులు ఎక్కువగా తింటారని, తక్కువ వచ్చిందని ఏజెన్సీ వారు తెలపడంతో మరో నాలుగు కేజీల బియ్యం ఇచ్చానన్నారు. ఎక్కువ మంది విద్యార్ధులు మధ్యాహ్న భోజనం తినరని, దాంతో తాను ఎంతమంది తింటారోనని విద్యార్ధులను విచారించిన తరూతనే రేషన్ ఇస్తున్నానని తెలిపారు. విద్యార్ధులు మధ్యాహ్నభోజనం తక్కువ వచ్చిన విషయం తెలుసుకున్ని సిపిఐ నాయకులు కమతం కాటమయ్య పాఠశాలకు వచ్చి పరిశీలించారు. భోజనం చేయకుండా వున్న విద్యార్ధులకు హోటల్ నుండి భోజనం తెప్పించి తినేలా చేశారు. అయితే పాఠశాలకు వచ్చిన ఎంఎల్‌ఏ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దృష్టికి రేషన్ తక్కువగా వచ్చినట్లు తెలిపిన తరువాతనే మరింత తక్కువగా రేషన్ ఇస్తోందని, రోజుకు కనీసం 30మంది విద్యార్ధుల రేషన్ తక్కువగా ఇవ్వడంతో పాటు బిల్లులు కూడా తక్కువగా పెడుతోందని తెలిపారు. పాఠశాలకు వచ్చిన సమయంలో వున్న హాజరు ఒకటయితే బిల్లులు పెట్టే సమయానికి తక్కువగా హాజరు చూపెడుతోందని ఏజెన్సీ నిర్వాహకులు వాపోయారు.

## ఉరవకొండ నియోజకవర్గంలో 2,15,481 మంది ఓటర్లు..!

**-గత ఏడాదితో పోల్చితే తగ్గిన 1,848 ఓట్లు**

**-పురుషులు 1,07,32, మహిళలు 1,08,113**

**ఉరవకొండ, జనవరి 6 ప్రభాతవార్త :** 2023 తాజా ఓటర్ల జాబితా ప్రకారం ఉరవకొండ (149) అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,15,481కు చేరింది. గత ఏడాది 2,17,329 మంది ఓటర్లు ఉండగా గతంతో పోల్చితే 1,848 మంది ఓటర్లు తగ్గారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,07,342, మహిళా ఓటర్లు 1,08,113, ఇతరులు 26 మంది ఉన్నారు. ఉరవకొండ మండలంలోని 80 పోలింగ్ కేంద్రాల పరిధిలో 65,676 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 32,180 మంది, మహిళలు 33,487 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. విడపనకల్లు మండలంలోని 50 పోలింగ్ కేంద్రాల పరిధిలో 50,773 మంది ఓటర్లు ఉండగా పురుషులు 25,469 మంది, మహిళలు 25,295 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. వజ్రకరూరు మండలంలోని 50 పోలింగ్ కేంద్రాల పరిధిలో 32,984 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 16,698 మంది, మహిళలు 16,283 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. బెలుగుప్ప మండలంలోని 42 పోలింగ్ కేంద్రాల పరిధిలో 35,227 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 17,536 మంది, మహిళలు 17,691 మంది ఉన్నారు. కూడేరు మండలంలోని 37 పోలింగ్ కేంద్రాల పరిధిలో 30,821 మంది ఉండగా అందులో పురుషులు 15,459 మంది, మహిళలు 15,357 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. నియోజకవర్గంలో పురుషుల సంఖ్య కంటే 771 మంది మహిళలు అధికంగా ఉండటం విశేషంగా చెప్పాలి.

## శ్రీ దుర్గాభవాని ఆలయంలో విశేష పూజలు

**-పౌర్ణమి శుక్రవారం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి**



**ఉరవకొండ, జనవరి 6 ప్రభాతవార్త :** పట్టణంలోని స్థానిక వైకేపీ కార్యాలయంవద్దగల శ్రీ దుర్గాభవాని ఆలయంలో స్వస్తిశ్రీ శుభకృత్‌నామ సంవత్సరం పుష్యమాస పౌర్ణమి శుక్రవారం విశేష పూజలు జరిగాయి. ప్రాతఃకాలంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అలంకరణ, మహా మంగళహారతి కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగాయి. పౌర్ణమి శుక్రవారం కావడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించింది.

## నిండిన ప్రధాన మురుగునీటి కాలువ..!

**-ఈశ్వరమ్మ ఆలయంవద్ద బయటకు వచ్చి పారుతున్న మురుగు**

**-ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు, ఆలయానికివచ్చే భక్తులు**

**-శుబ్రానికి రూ.లక్షలు ఖర్చు పెడుతున్నా లభించని శాశ్వత పరిష్కారం**


ఈశ్వరమ్మ ఆలయంవద్ద నిండిపోయిన ప్రధాన మురుగునీటి కాలువ

**ఉరవకొండ, జనవరి 6 ప్రభాతవార్త :** ఉరవకొండ పట్టణంలోని స్థానిక ఈశ్వరమ్మ ఆలయం ముందు నుండి పారే ప్రధాన మురుగునీటి కాలువ పూర్తిగా నిండిపోయి భరించలేని దుర్వాసన, విపరీతమైన దోమలతో స్థానికులు, ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువ నుండి మురుగు బయటకువచ్చి రోడ్డు పక్కన చేరుతుండటంతో ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారి ఆలయ పవిత్రత దెబ్బతింటోంది. కాలువలో మురుగుతోపాటు చెత్తా చెదారం, వ్యర్థాలు అధికమై ప్రధాన రోడ్డుకు పక్కన ఏర్పాటు చేసిన ఆలయ ముఖ ద్వారం (ఆర్చ్) వద్ద పేరుకుపోయి కనిపిస్తోంది. ప్రధాన మురుగునీటి కాలువ నిండిన ప్రతిసారి దాన్ని శుభ్రం చేయడానికే గ్రామ పంచాయతీ లక్షలాది రూపాయల నిధులు ఖర్చు పెడుతుండటం విశేషంగా చెప్పాలి. అయితే నేటికీ కాలువలో నీరు సులువుగా పారేందుకు వీలుగా కట్టడాలు లేకపోగా మట్టి కాలువలోనే మురుగు పారాల్సి వస్తుండటంతో ఈ పరిస్థితులు నెలకొంటున్నాయి. కాలువ శుభ్రానికే లక్షల రూపాయలు ఖర్చుపెట్టే పంచాయతీ కాలువకు కట్టడాలు నిర్మించి దానికి పైకప్పు ఏర్పాటు చేసి మురుగు సులువుగా పారే ఏర్పాట్లు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## సమాజంలోని అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే పోలీసుల పని

**- ఏడిజిపి ఎం.చంద్రశేఖర్**



సన్మాన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

**పావగడ, జనవరి 6 ప్రభాతవార్త :** సమాజంలోని అసాంఘీక కార్యకలాపాలను అరికట్టి ప్రజల సంరక్షణను చేయడమే పోలీసుల పని అని ఏడిజిపి ఎం.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం పావగడ పట్టణంలోని ఎస్‌ఎస్‌కె సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన పావగడ నాగరిక వేదిక, సంఘ సంస్థల ఆధ్వర్యంలో ఎడిజిపి చంద్రశేఖర్‌కు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సన్మానంతో నాకు బాధ్యతలు పెరిగాయని అన్నారు. తాలూకాలోని మట్కా మహమ్మారిని దాదాపుగా అరికట్టమన్నారు. మట్కా మహమ్మారిని దాదాపుగా అరికట్టామన్నారు. మట్కా ఆడించే వారిని సరభక్షకులుగాను, సమాజ ఘ్నూతుకులుగా ఆయన అభివర్ణించారు. మట్కా మహమ్మారితో అనేక కుటుంబాలు వీధిపాలైనాయని కొంత మంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నట్లు తెలిపారు. పావగడ తాలూకాలో మట్కాను పూర్తిగా అరికడతామన్నారు. తాలూకాలోని ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ స్పందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జపానంద స్వామిజీ మాట్లాడుతూ.. యువతకు వివేకానంద స్పూర్తిదాయకమని ఆయనను ఆదర్శంగా తీసుకుని యువకులు ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ప్రతిఒక్కరికీ జీవితంలో సాధించాలన్న తపన ధ్యేయం ఉండాలన్నారు. ఉన్నతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని యువకులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసి రఘునందన్, డాక్టర్ జి.వెంకట్రామయ్య, డిఎస్పీ వెంకట నాయుడు, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్పలు మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఆర్.అంజినప్ప, మానం వెంకటస్వామి, ఎగువపల్లి నాని, అన్నదానపుర జయరాం, అన్నదానపుర లక్ష్మినారాయణ, గోవిందప్ప, సత్యనారాయణ చౌదరి, తాటిమేకలపల్లి మూర్తి, పరిటాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు .

### ఏడిజిపి చంద్రశేఖర్‌ను సన్మానించిన ఎగుపవల్లి నాని


ఏడిజిపి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఎగువపల్లి నాని

పావగడ పట్టణంలోని ఎస్‌ఎస్‌కె సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన పావగడ నాగరిక వేదిక, సంఘ సంస్థల ఆధ్వర్యంలో ఏడిజిపి చంద్రశేఖర్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే ఎగువపల్లి నాని, జయరాం, చెన్నకేశవ తదితరులు ఏడిజిపిని సన్మానించారు.

## పెరికిన కార్డులను పునరుద్దరించండి

**అగళి, జనవరి 6 ప్రభాతవార్త :** మండలంలో వివిధ కారణాలతో వందలాది రేషన్‌కార్డులను రద్దు చేశారని వాటిని పునరుద్దరించాలని కార్డులు రద్దైన వారు కోరుతున్నారు. నాలుగు చక్రాల వాహనం ఉందని, 300 యూనిట్ల కరెంటు వాడుతున్నారని, సరిభూమి 3 ఎకరాలు, మెట్ట 10 ఎకరాలు ఉందని ఉపాధి కోసం బెంగుళూరుకు కార్డులో పేరుండి వలస వెళ్లి తాత్కాలిక ఉద్యోగం చేస్తున్న 20వేలో.. 25వేలో జీతం పొందుతుంటారు. అలాంటి వారు ఇన్‌కం ట్యాక్స్ చెల్లిస్తున్నారని, కార్డులు తొలగించడం మూలంగా సంక్షేమ కార్యక్రమాలు అందడం లేదని అమ్మఒడి, చేయూత, చేదోడు, స్కాలర్‌షిప్‌లు, ఇన్‌పుట్ సబ్సిడి, పెళ్లికానుకలు, ఈ సంక్షేమ కార్యక్రమాలు అన్ని మా దరికిచేరడం లేదని, రెండేళ్లుగా కార్డు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని అర్హులైన వారికి కార్డులను పునరుద్దరించడం లేదా కొత్త కార్డులనైనా ఇవ్వాలని జడ్పిటిసి ఉమేష్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ కోరుతున్నారు. ఏదో ఒక నెపంతో కార్డులను తొలగించకుండా అందరికీ అందివ్వాలని సంక్షేమాలు పేదలకు చేరాలన్నారు.

## కేకాతిలో గడపగడపకు మన ప్రభుత్వం


గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**గుడిబండ, జనవరి 6 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కేకాతి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కోసంమన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న జగనన్నకు మనమంతా తోడుగా నిలబడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి భూతరాజు, ఎంపిపి రాధమ్మ, తహశీల్దారు నాగభూషణం, వక్కలిగ రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ నళిని, సింగిల్ విండో అధ్యక్షులు చంద్రశేఖర్, సర్పంచులు నరసమ్మ, డిఎల్ యంజారేగౌడ్, రంగస్వామి, లక్ష్మినారాయణ, వైస్ ఎంపిపి రత్నమ్మ, శివకుమార్, జిల్లా బిసి సెల్ కార్యదర్శి శివకుమార్, ఎస్సీ సెల్ కార్యదర్శి రమేష్, బిసి సెల్ కార్యదర్శి పాండు, గిరిధర్, శివరాజ్, ఈరన్న, చంద్రశేఖర్, పుట్టలింగప్ప, మారుతి, నిజలింగప్ప, తిప్పేస్వామి, వార్డు మెంబర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాలెంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తేదేపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ చొరవతో అందిన పింఛన్లు

**గుడిబండ, జనవరి 6 ప్రభాతవార్త :** మండలంలోని కొంకల్లు గ్రామ పంచాయితీలో వాలెంటీర్ల చేతివాటం ప్రదర్శించడంతో పింఛను లబ్దిదారులు ఆందోళన నిర్వహించారు. బయోమెట్రిక్ వేయించుకుని ఆరు రోజులు గడిచినా డబ్బులు ఇవ్వలేదంటూ కొంకల్లు గ్రామానికి చెందిన కరియన్న, చిత్తప్ప, హనుమంతరాయప్ప, శంకరమ్మ, ఎంపిడిఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ చొరవ తీసుకుని లబ్దిదారులకు పింఛన్లను అందించే వరకు ఎంపిడిఓ కార్యాలయం నుంచి వెళ్లబోమని భీష్మించుకుని కూర్చోవడంతో అధికారులు లబ్దిదారులకు పింఛన్లను అందించారు. అలాగే అవకతవకలకు పాల్పడిన వాలెంటీర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే మంజునాథ్ మాట్లాడుతూ.. ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకునే జగన్ ప్రభుత్వం తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు అనే కారణంతో ఇలా పింఛన్ దారులను ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కొంకల్లు గ్రామ పంచాయితీలో ప్రభుత్వం పెంచిన 250 రూపాయలను వాలెంటీర్లు చాలా మంది లబ్దిదారులకు అందించలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరీ దీనిపై ఉన్నతాధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాలి.

## షేక్షానుపల్లిలో 15 బస్తాల పీడీఎస్ బియ్యం స్వాధీనం

**-ప్రజల నుండి సేకరించిన బియ్యం తరలిస్తుండగా పట్టివేత**


పట్టుబడిన లగేజీ వాహనంలోని రాయితీ బియ్యం

**ఉరవకొండ, జనవరి 6 ప్రభాతవార్త :** మండల పరిధిలోని షేక్షానుపల్లి గ్రామంలో అక్రమంగా తరలించడానికి సిద్దం చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన 15 బస్తాల పేదల బియ్యాన్ని శుక్రవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని రేషన్‌కార్డు లబ్దిదారుల నుండి ఇద్దరు మహిళలు బియ్యాన్ని కొనుగోలుచేసి ఏస్ మ్యాజిక్ వాహనంలో లోడ్ చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని బియ్యంపాటు వాహనాన్ని, మహిళలను స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. బియ్యాన్ని ఎవరు సేకరించి ఎక్కడికి తరలిస్తున్నారన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సింది.

## మళ్లీ రోడ్డెక్కిన గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు

**- నష్టపరిహారం ప్రకటించి సర్వే నిర్వహించాలి**

**- గోరంట్లలో రోడ్డుపై బైటాయించి ధర్నా నిర్వహించిన రైతులు**


రోడ్డుపై బైటాయించిన రైతులు

**గోరంట్ల, జనవరి 6 ప్రభాత వార్త :** గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు శుక్రవారం మళ్లీ రోడ్డుపై బైటాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వ్యవసాయ పొలాలను గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పనుల కోసం, ఫ్లైఓవర్ కోసం వంద ఎకరాలకు పైగా తీసుకుంటున్నారని మా బ్రతుకులు బజారున పడకుండా నష్టపరిహారం అధికంగా చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు కదిరి – గోరంట్ల రహదారి లోని జీనంవాండ్లపల్లి వద్ద వివిధ గ్రామాల రైతులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహన రాకపోకలు నిలిచిపోవడంతో బారులు తీరడంతో విషయం తెలుసుకున్న తహశీల్దార్ రంగనాయకులు, ఎస్ఐ ఇక్బాల్‌బాష పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులతో చర్చించారు. ఇప్పటికే రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ప్రభుత్వం నుండి ఎకరాకు ఎంత నష్టపరిహారం ఇస్తున్నారనేది జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకోవాల్సి వుందని వెంటనే మళ్లీ కలెక్టర్‌కు తెలిపి న్యాయం చేస్తామని హామి ఇచ్చారు. దీంతో ఎలాంటి సర్వే పనులు తమ పొలాల్లో చేయరాదని, నష్టపరిహారం ప్రకటించే వరకు అధికారులు తమ పొలాల్లోకి రావద్దని డిమాండ్ చేశారు. దీంతో నష్టపరిహారం ఎంత వస్తున్నారు అనేది ప్రకటించే వరకు సర్వే నిపిలివేయడం జరుగుతుందని తహశీల్దార్ హామి ఇవ్వడంతో రైతులు శాంతించారు. ధర్నా కార యక్రమంలో రైతులు శ్రీనివాసులు, చలపతి, డాక్టర్ రవితేజ, మదన, కుమార్, నరేంద్రరెడ్డి, తదితర రైతులు పాల్గొన్నారు.

## నిప్పంటుకుని కారు దగ్ధం


కాలిపోతున్న కారును పరిశీలిస్తున్న పోలీసులు

**గోరంట్ల, జనవరి 6 ప్రభాతవార్త :** మండలంలోని బూదిలి పంచాయతీ గొల్లపల్లి వద్ద ఇండికా కారు దగ్ధమై పూర్తిగా కాలిపోయిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రోడ్డుపై ఉలవ పంట ఎండవేసి ఉండడంతో ఒక్కసారిగా కారు చక్రాలకు ఉలవ కట్టె చుట్టుకుని మంటలు చెలరేగి కారు దగ్ధం అవగా కారులో ప్రయాణిస్తున్న చిలమత్తూరు మండల గుమ్మాలపల్లి గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి తదితరులు నలుగురు సురక్షితంగా బయటపడగా రోడ్లపైనే పంట నూర్పిడి కేంద్రాలు ఎక్కడపడితే అక్కడ వేస్తుండడంతో రోడ్డు ప్రమాదాలతో పాటు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. సంఘటన తెలిసిన వెంటనే సిఐ సుబ్బరాయుడు, సర్పంచు ఆంజనేయులు అక్కడికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు.

## ఉద్యోగకల్పన స్థాయికి విద్యార్థులు ఎదగాలి

**- మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా**



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మధు మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, జనవరి 6 ప్రభాతవార్త :** విద్యార్థులు విద్య సముపార్జనతో పాటు కేవలం వారు తాము ఉద్యోగాలు పొందేందుకు కాకుండా ఇతరులకు ఉద్యోగ కల్పన అందించే స్థాయికి ఎదగాలని ప్రముఖ పారిశ్రామికవేత్త ఎపిఎస్ గ్రూప్‌ఆఫ్ కంపెనీస్‌చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా ఆకాంక్షించారు. గుత్తి శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎంసిఎ, ఎంబిఎ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్త కావాలనే లక్ష్యంతో విద్యను అభ్యసించాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే యువత భాగస్వామ్యం ఎంతో వుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రఘునాథరెడ్డి, కరస్పాండెంట్ వికె పద్మావతి, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ అరవింద్, ఎంబిఎ హెచ్‌ఒడి నాగప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపానేతను పరామర్శించిన ఎమ్మెల్యే వైవిఆర్


వైకాపానేతను ఎమ్మెల్యే పరామర్శిస్తున్న దృశ్యం

**గుత్తి, జనవరి 6 ప్రభాతవార్త :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుత్తి మున్సిపల్‌చైర్‌పర్సన్ భర్త, వైకాపా పట్టణ కన్వీనర్ హుసేన్‌పీరాను శుక్రవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు. స్వగృహానికి వెళ్లిన ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకుని త్వరగా కొలుకోవాలన్నారు. అనంతరం కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి విశాలాక్షి, జెడ్‌పిటిసి రాధికాయాదవ్, మున్సిపల్‌వైస్‌చైర్మన్లు వరలక్ష్మి, పద్మలతారెడ్డి, వైకాపా ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, సివి రంగారెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ వరదరాజులు, పోలింగ్ బూతు కన్వీనర్ రంగస్వామి, కౌన్సిలర్లు నజీర్, ఫారుక్, వాల్మీకి శివ, సుబ్బయ్య, ఖాజాఖాన్, సుజాతమ్మ, మాజీ జెడ్‌పిటిసి ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు


పిహెచ్‌సిలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

**విడవనకల్లు, జనవరి 6 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు వైద్యసేవలు అందుతున్నాయా లేదా అని పరిశీలించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విజిలెన్స్ అధికారులు సాయంత్రం వరకు తనిఖీలు కొనసాగించారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు మందులు, ఒపి వివరాలు, రోగులకు అందుతున్న వైద్యసేవలతో పాటు సిబ్బంది హాజరుకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఇటీవల పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు సక్రమంగా అందలేదని ఆరోపణలు వున్న నేపథ్యంలో ఈ తనిఖీలు కొనసాగాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం మందులతో పాటు పలు సదుపాయాలు కల్పిస్తున్నా గ్రామీణ ప్రజలకు సరైన వైద్యసేవలు అందలేదన్న ఆరోపణలు వున్న వస్తుండడంతో మరోపక్క వైద్యసిబ్బంది సైతం విధులకు సక్రమంగా హాజరు కాలేదన్న ఆరోపణలు వున్న నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు ముందుగా ఎంచుకున్న పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వైద్యాధికారుల పనితీరుతో పాటు అక్కడ వైద్య సేవలపై రోగుల ద్వారా ఆరా తీశారు. అలాగే ప్రతి పిహెచ్‌సిలో ప్రభుత్వం సరఫరా చేసిన మందుల నిల్వలపై ఆరా తీశారు. అలాగే వైద్య సిబ్బంది హాజరు విషయాన్ని కూడా పరిశీలించారు. పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా ఈ తనిఖీ వివరాలను సమగ్రంగా ప్రభుత్వానికి అందచేస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఎస్ఐ బాలకృష్ణ, ఎజి శివప్రసాద్, డాక్టర్ జెవి శ్రీధర్, డాక్టర్ రాజేంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ పాలనలో రాష్ట్రం దివాలా..!


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

**మడకశిర టౌన్, జనవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో దివాలా తీసిందని రాష్ట్ర తేదేపా ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. రాష్ట్రం తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు


కార్యక్రమంకు హాజరైన తేదేపా కార్యకర్తలు, మహిళలు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మెళవాయి గ్రామంలో మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను అసమర్ధతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ.. గ్రామంలో విద్యుత్ సమస్య, రోడ్ల పరిస్థితి, గిట్టుబాటు ధర, ఇసుక, తాగునీటి సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నామన్నారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి మూడున్నర సంవత్సరాలు గడిచినా ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. దీంతో ఎందరో నిరుద్యోగులుగా మారారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మినారాయణ, కల్లుమరి సర్పంచు గంగమ్మ తనయుడు నాగరాజు, మాజీ సర్పంచు నారాయణగౌడ్, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు జైకుమార్; సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, కిష్టప్ప, రవీంద్రారెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, సుబ్బారెడ్డి, ఎల్ఐసి హనుమంతరాయుడు, సుబ్బరాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోరంట్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో విజిలెన్స్ తనిఖీలు

**- వైద్య సిబ్బంది పనితీరుపై రోగులతో విచారణ**


తనిఖీ చేస్తున్న దృశ్యం

**గోరంట్ల, జనవరి 6 ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లాలోని గోరంట్ల పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అనంతపురం విజిలెన్స్ అధికారుల బృందం అధికారులు వెంకటేశ్వర్లు మరియు వాసుప్రకాష్‌లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను సిబ్బంది వైద్యులు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఆన్‌లైన్ ట్యాబ్‌లో బయోమెట్రిక్‌పై పూర్తి స్థాయిలో పరిశీలించగా 33 మంది సిబ్బంది వున్నారు. అయితే 23 మంది మాత్రమే బయోమెట్రిక్ వేయడంతో మిగిలిన ఏడు మంది ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. నైట్ డ్యూటీలో 7 మంది సిబ్బంది వుంటారని తెలపడంతో వారు వాటిపై విచారణ చేపట్టారు. అదేవిధంగా పరిసర ప్రాంతాల్లో మరియు మరుగుదొడ్లు, ప్రతి గదిని పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. జనరల్ డ్యూటీ అటెండర్లు ఎంత మంది వున్నారు వర్కర్లు ఎంత మంది వున్నారు. వారి పనితీరు పట్ల రోగులతో అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సేవలు ఎలా అందుతున్నాయి సమయపాలన పాటిస్తున్నారా లేదా అని వాటిపై క్షుణ్ణంగా పరిశీలించి వెళ్లారు. అలాగే తదితర వివరాలను డాక్టర్ వినోద్‌కుమార్, బాబునాయక్, తదితరులను అడిగి తెలుసుకున్నారు.

## విద్యార్థుల సదుపాయాల పట్ల కమీషన్ సభ్యుని ఆగ్రహం


సేవాఘడ్‌లో వసతులు పరిశీలిస్తున్న కమీషన్ సభ్యుడు

**గుత్తి, జనవరి 6 ప్రభాతవార్త :** మండలంలోని సేవాఘడ్‌లో వున్న గిరిజనసంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించిన ఎస్‌టి కమీషన్ సభ్యుడు శంకర్‌నాయక్ విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు,


విద్యార్థులతో మాట్లాడుతున్న దృశ్యం

మౌళిక వసతుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డార్‌మెటీరియల్, మరుగుదొడ్లు, స్నానపుగదులు, వంట గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించి అపరిశుభ్రంగా వునాన్నయంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల మధ్య నెలకొన్న అనైక్యత పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత విభేదాలు విడనాడి విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యావంతులై తద్వారా కుటుంబ దేశాభివృద్ధికి పాటుపడాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్‌బాష, సిఐ వెంకటరామిరెడి, ఎంఇఒ రవినాయక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రెండు పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు

**-రూ.4.12 లక్షల నగదు, 3 బాక్సుల కర్నాటక మద్యం, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం-పెంచలపాడు, గడేకల్లు గ్రామాల శివార్లలో కొనసాగిన దాడులు**


పట్టుబడిన పేకాట రాయుళ్లతో సీఐ బి.శేఖర్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి సిబ్బంది దృశ్యాలు



**ఉరవకొండ, జనవరి 6 ప్రభాతవార్త :** ఉరవకొండ రూరల్ సర్కిల్ పరిధిలోని విడపనకల్లు మండలం పెంచలపాడు, గడేకల్లు గ్రామ శివార్లలో శుక్రవారం రాత్రి రెండుచోట్ల పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 18 మంది పేకాటరాయుళ్లను అరెస్టుచేసి వారివద్ద నుండి 4,12,220 రూపాయల నగదుతోపాటు 3 బాక్సులు (90ఎంఎల్) కర్నాటక మద్యంను స్వాధీనం చేసుకోవడం జరిగిందని రూరల్ సీఐ బి.శేఖర్, విడపనకల్లు ఇంచార్జ్ ఎస్ఐ టి.పి.వెంకటస్వామి తెలిపారు. కచ్చితమైన సమాచారంతో ఏక కాలంలో రెండు చోట్ల దాడులు నిర్వహించామన్నారు. పెంచలపాడులో నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు, గడేకల్లులో 14 మందిని అరెస్టు చేసి నగదుతోపాటు కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని వారు వివరించారు.

05ATP06_05ATP06.qxd 07-01-2023 AM 12:00 Page 1



# చీకటి జీవో ప్రతిపక్ష పార్టీలకేనా, వైసిపికి వర్తించవా ?

## - మండిపడ్డ టిడిపి, సిపిఐ పార్టీలు



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి, సిపిఐ శ్రేణులు



జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, జనవరి 6, ప్రభాతవార్త : ర్యాలీలు, సభలు అనుమతులు ఉన్న చోటే నిర్వహించాలని జారీ చేసిన చీకటి జీవో కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే వర్తిస్తుందనేలా జగన్ ప్రభుత్వం వ్యవహ రిస్తోందని టిడ పి, సిపిఐ నాయకులు మండిపడ్డారు.

చీకటి జీవో నంబర్ 1 జారీ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కదిరి–హిందూపురం ప్రధాన రహ దారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 1 ప్రతి పక్ష పార్టీలపై ప్రయోగిస్తున్నారని వైసిపి పార్టీ నాయకులు నిర్వహి స్తున్నా వారిసభలకు మినహాయింపు ఇచ్చినట్టుగా ప్రభుత్వం వ్యవహరి స్తోం దన్నారు. గతంలో జగన్ తనసుదీర్ఘ పాదయాత్రకు చంద్రబాబు ఎటు వంటి ఆంక్షలు విదించలేదన్న విషయం జగన్ గుర్తెరిగి మసలు కోవాలన్నారు. ప్రతి పక్ష పార్టీల నేతలపై దాడులను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం జీవో ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో టిడిపి, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబునాయుడు పెద్ద డ్రామా ఆర్టిస్ట్

## - వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య

తాడిపత్రిఅర్బన్, జనవరి 6 ప్రభాతవార్త

చంద్రబాబునాయుడు పెద్ద డ్రామా ఆర్టిస్ట్ అని వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. స్థానిక నివాసంలో శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కావాలనే కుప్పంలో పోలీసులను బెదిరిస్తూ అలజడి వాతావరణం సృష్టిస్తున్నాడన్నారు. చంద్రబాబునాయుడు అమాయక ప్రజలను రెచ్చగొడుతున్నారని ప్రజల సానుభూతి పొంది వచ్చే ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్నారు. కప్పంలో చంద్రబాబునాయుడుకు ఓటమి భయం పట్టుకుంది కాబటే ఇలా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. కుప్పం ప్రజలు వైసిపి పథకాలను కోరుకుంటున్నారని ఓటమి భయంతో ప్రజలను రెచ్చగొడుతూ పోలీసు వారిని కూడా బెదిరిస్తున్నాడన్నారు. 70 ఏళ్ల వయసు మీద పడ్డా 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ రాజకీయంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనలేక ఇలాంటి కుటిల రాజకీయాలు చంద్రబాబు చేస్తున్నారన్నారు. జిఒ నెంబర్–1 ప్రతిపక్షంతో పాటు పాలకపక్షానికి కూడా వర్తిస్తుందన్నారు. ఇలాంటి డ్రామాలు ఎందుకు ఆడాల్సి వస్తుందో చంద్రబాబునాయుడే తెలపాలన్నారు. సిఎం కుర్చీ కోసం ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. ప్రజలకు మంచి చేసే గుణం వుండాలి కానీ పేపర్లు, ఛానెళ్లు వున్నాయి కదా అని ప్రజలను మభ్యపెట్టడం తగదని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

# పేద విద్యార్థులకు వరం సిబిఎస్ఈ సిలబస్

## ఎంఇఓ చెన్నకృష్ణ



శిక్షణ కార్యక్రమానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు

కదిరి టౌన్, జనవరి 6 ప్రభాతవార్త

పేద విద్యార్థులకు సిబిఎస్ఈ సిలబస్ దేవుడిచ్చిన వరమని కదిరి ఎంఇఓ చెన్నకృష్ణ పేర్కొన్నారు. ఇందులో భాగంగా గత రెండు రోజులుగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సిబిఎస్ సిలబస్‌పై ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిబిఎస్ సిలబస్‌కు జిల్లాలోని 49 పాఠశాలలను ఎంపిక చేయడం నిరుపేదలకు ఎంతో వరంగా మారిందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో నిరుపేద విద్యార్థులకు సైతం ఖరీదైన విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలోసిబిఎస్ఈ నిపుణులు ఈశ్వరి, సురేష్, హెచ్ఎం నరసింహా, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, ఏఎంఓ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

# మోడికి ధన్యవాదాలు తెలిపిన బిజెపి వజ్ర



మోడికి ధన్యవాదాలు తెలుపుతున్న బిజెపి వజ్ర

కదిరి, జనవరి 6 ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షులు వజ్రభాస్కర్‌రెడ్డి దేశ ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. ప్రధానిమోదీ 912.94 కోట్లతో సత్యసాయి జిల్లాలో ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సందర్భంగా అలాగే బెంగుళూరు–విజయవాడ ఎన్‌హెచ్ 544(జి) ఎకనామిక్ కారిడార్‌లో ఈ ఆరులైన్ల రోడ్డు నిర్మాణపు పనులను చేపట్టనానికి నిధులు మంజూరు చేశారన్నారు. కోడూరు నుంచి వానవోలు వరకు ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి అభివృద్ధికి భారతమాల పరియోజన కింద ఈ నిధులను ఇచ్చి ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి తోడ్పాటు నందించిన కేంద్ర మంత్రి నితిన్‌గడ్కారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీబుగ్గరామలింగేశ్వరునికి అన్నాభిషేకం

తాడిపత్రిఅర్బన్, జనవరి 6 ప్రభాతవార్త

పట్టణంలోని పురాతన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామికి శుక్రవారం అన్నాభిషేకం నిర్వహించారు. శివముక్కోటి పౌర్ణమి ఆరుద్రనక్షత్రం పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు అభిషేకాలు నిర్వహించి స్వామివారికి అన్నాభిషేకం చేశారు. అలాగే శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారికి అర్చకులు శంకరయ్య శర్మ, గిరిశర్మలు కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతా రామలక్ష్మణ ఆంజనేయ స్వామికి, నవగ్రహాలకు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.



పరమేశ్వరునికి అన్నాభిషేకం చేసిన దృశ్యం

# రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షునికి స్వాగతం పలికిన నాయకులు



స్వాగతం పలుకుతున్న దృశ్యం

పుట్లూరు, జనవరి 6 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కామ్రేడ్ జల్లివిల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఆవుల శేఖర్‌లు అనంతపురం జిల్లాకు వస్తున్న నేపథ్యంలో తాడిపత్రి రైల్వేస్టేషన్ నుండి పుట్లూరు మండలం మీదుగా అనంతపురం వెళుతున్న సందర్భంలో పుట్లూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వారికి పూలమాలలు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మినారాయణ, పెద్దిరాజు, డిహెచ్ఎస్ మండల కార్యదర్శి రమేష్, శివ పాల్గొన్నారు.

# పొట్ట శివశంకర్‌రెడ్డికి ఘననివాళి



పొట్ట శివశంకర్‌రెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అమడగూరు, జనవరి 6 ప్రభాతవార్త

మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం పొట్ట శివశంకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. పొట్ట శివశంకర్‌రెడ్డి ఇరిగేషన్ ఎగ్జిక్యూటీవ్ సూపరింటెండెంట్ ఇఇగా అనంతపురం, కడప, కర్నూల్ జిల్లాల ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తూ గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని గ్రామంలో బంధువులు, ప్రజలు ఆయన ఘాట్ వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొట్ట శివశంకర్‌రెడ్డి సతీమణి పొట్ట పార్వతమ్మ, కుమార్తె హారిక, సోదరులు పొట్ట పురుషోత్తంరెడ్డి, జయదేవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎంపిటిసి పెద్దప్పయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బోడాయిపల్లిలో కార్డెన్‌సర్చ్



ఇంటిలో సోదాలు నిర్వహిస్తున్న దృశ్యం



గ్రామంలో తిరుగుతున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, జనవరి 6 ప్రభాతవార్త

మండలంలోని బోడాయిపల్లి గ్రామంలో సిఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో పట్టణ సిఐ ధరణిబాబు, పోలీసులు కలిసి శుక్రవారం కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నేరస్తుల ఇళ్లతో పాటు అనుమానితుల నివాసాలతో పాటు గడ్డివాములు, పాతబడిన ఇళ్లలో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. ఎక్కడా కూడా ఎలాంటి మారణాయుధాలు లభించలేదు. అనంతరం పోలీసులు ప్రజలతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏ సమస్యలు వున్నా పోలీసులకు తెలియచేయాలన్నారు. ఏదైనా అనుమానం వున్న వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని వారు ప్రజలను కోరారు.

# నూతన బస్సుల ప్రారంభంలో ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి

శింగనమల, జనవరి 6 ప్రభాతవార్త

అనంతపురం బస్సు డిపోలో నూతన ఎయిర్ బస్సులను శుక్రవారం ఆర్టిసి జోనల్ ఛైర్‌పర్సన్ మంజుళ, శింగనమల వైకాపా నియోజకవర్గ నాయకులు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమి ఛైర్‌పర్సన్ హరితలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, వైకాపా నాయకులు రమేష్‌గౌడ్, రీజనల్ మేనేజర్ సుమంత్, సీఎంఈ మోహన్‌కుమార్, బిఎం నాగభూపాల్ తదితరులు పాల్గొన్నారు.




జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

# ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యాడికి, జనవరి 6 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులతో గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాష తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయంలో జరుగుతున్న పనులపై చర్చించారు. ప్రస్తుతం రైతుల పొటాష్ కొరత వుందని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. రైతులకు విడిగా పనిముట్లు రాయితీతో అందించాలని రైతులు కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు కోమల, రైతులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ

యాడికి, జనవరి 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలో శుక్రవారం జనసేన పార్టీ క్యాలెండర్‌ను కన్వీనర్ కోడి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ఆశయాలను, సిద్ధాంతాలను, మ్యానిఫెస్టోను అందులో ప్రచురించినట్లు తెలిపారు. భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల గురించి పొందుపర్చడం జరిగిందని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, శివమల్లి, విజయ్, రాజేష్, మహేష్, నరేష్, మధు ఆచారి, జాని, తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాలెండర్ పంపిణీచేస్తున్న దృశ్యం

